# జైహింద్
## –పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

## (గత సంచిక తరువాయి)

**సుభాస్ చంద్ర బోస్** మీద జపాను సైన్యాధ్యక్షుడి నుండి ఒత్తిడి పెరిగి పోతోంది.

"మనం అనువయిన సమయాన్ని అనుమానాలతో వృధా చేస్తున్నాం. ఇంఫాల్, కోహిమాలలో ఉన్న బ్రిటిషు సైన్యం వెనక్కి వెళ్లి పోయింది. ఇప్పుడు ఉన్నది నామ మాత్రపు సైన్యమే. ఒకసారి ఇంఫాల్, కోహిమాలను వశపరచుకుంటే ఇండియాలోకి దారి దొరికినట్లే. మీరు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో మాకు అర్థం కావటం లేదు..." అన్నాడు జపాను జనరల్ సాటో.

సుభాస్ చంద్ర బోస్ ఏమీ మాట్లాడ లేదు. ఇంఫాల్, కోహిమాల నుండి బ్రిటిషు సైన్యం వెనక్కి వెళ్లటం అన్నది బుద్ధి ఉన్న ఏ సైన్యాధ్యక్షుడూ తీసుకోని నిర్ణయం. అందులో యుద్ధ కళలో నిపుణులయిన బ్రిటిషు వాళ్లు అలాంటి నిర్ణయం తీసుకున్నారంటే ఆయనకు నమ్మకం కుదరటం లేదు. తన అనుమానాన్ని నివృత్తి చేసుకోవటానికి పంపిన పాంచ్ పటాకా నుండి ఎలాంటి సమాచారమూ లేదు. ఎన్ని రోజులని తను మాత్రం జపాను వారిని ఆపగలడు?

ఎట్టకేలకు ఆలోచనల నుండి బయటకు వచ్చిన ఆయన, "ఇవాళ తారీకు ఎంత?" అని అడిగాడు.

"ఏప్రిల్ 2, 1944."

"ఎల్లుండి ఏప్రిల్ 4 న దాడి చేద్దాం. ఈలోపు మనం పంపిన గూఢచారులు ఏమన్నా వార్త పంపుతారేమో ఎదురు చూద్దాం..." అన్నాడు.

"సరే. నేను వెళ్తున్నాను. ఇరు సైన్యాలను మీరు చెప్పినట్లే ఆప్రిల్ 4 న ఇండియా మీద దాడికి సన్నద్ధంగా ఉంచుతాను..." అంటూ సాటో వెళ్ళిపోయాడు.

కాంచనమాల, చేవా బంధింపబడి ఉన్నారు. కోహిమాకు ఊరి బయట ఉన్న మిలటరీ క్యాంపులో వారిద్దరిని వేరువేరు గదుల్లో బంధించారు.

ఎలా అయినా తప్పించుకోవాలని, తప్పించుకుని తమకు తెలిసిన నిజాన్ని సుభాస్ చంద్ర బోస్‌కు చేరవేయాలని వారి మనసులు తహతహలాడుతున్నాయి.

కానీ వారు ఉన్నది ఒక దుర్భేధ్యమయిన రక్షణ వ్యవస్థలు ఉన్న మిలటరీ క్యాంపులో. ఎలా తప్పించుకోవాలి?

వారిద్దరినీ చేతులు వెనక్కి విరిచి బంధించి ఉంచారు. రోజుకు రెండుసార్లు ఆహారం అందిస్తున్నారు. ఆ సమయంలో మాత్రం అరగంట చేతులకు ఉన్న కట్లు విప్పుతున్నారు.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో గదిలోకి వచ్చాడు ఒక జవాను. ఆహారం ఉన్న పళ్లాన్ని నేలమీద పెట్టి, చేవా చేతులకు ఉన్న బంధనాలు విప్పాడు. మరేమీ మాట్లాడకుండా గది తలుపులకు బయట నుండి తాళం వేసి వెళ్లిపోయాడు. ఇదే ప్రక్రియ కాంచనమాల ఉన్న గదిలోనూ చేశాడు.

పళ్లెంలో ఉన్న ఆహారాన్ని శుభ్రంగా తింది చేవా. తప్పించుకోవాలంటే శక్తి అవసరం. శక్తి కావాలంటే ఆహారం తినాల్సిందే. అదే సమయంలో తమకు ఉన్న సమయం మించిపోతోందని కూడా ఆమెకు తెలుసు. తపించుకోవాలంటే ఇదే సమయం. మళ్లీ ఆ జవాను వచ్చాడంటే చేతులు కట్టేసి పోతాడు.

ఆమె మెడలో వేలాడుతున్న దండకు ఒక లాకెట్ ఉంది. అందులో రెండు పులి గోర్లు ఉన్నాయి. అందులో ఒక గోరును లాకెట్ నుండి విడదీసింది ఆమె. ఆ గోరు కొస చాలా వాడిగా ఉంది. దానిని అరచేతిలో దాచి పెట్టుకుని రాబోయే జవాను కోసం ఎదురు చూడసాగింది.

సరిగ్గా అర గంట తరువాత వచ్చాడు ఆ జవాను.

చేవా దగ్గరకు వచ్చి ఆమె చేతులను వెనక్కి జరపమని సైగ చేశాడు. అర చేతిలో ఉన్న పులిగోరును చూపుడు వేలుకీ, మధ్య వేలుకీ మధ్యకు తెచ్చింది చేవా. అతని మాటలు అర్థం కానట్లు చేతులు వెనక్కి జరపలేదు.

అతను విసుగ్గా ఆమె చేతులు వెనక్కి వంచటానికి మరింత దగ్గరకు వచ్చాడు.

హఠాత్తుగా ఆమె చేయి అతని కంఠం మీద దాడి చేసింది. వేళ్ల మధ్య ఇమిడి పోయిన పులిగోరు అతని కంఠాన్ని కత్తిరించింది.

ఏం జరిగిందో అర్థం కానట్లు అతను విహ్వలంగా చూస్తూ కింద పడి పోయాడు.

అతని శరీరాన్ని పక్కకు లాగి గది తలుపు దగ్గరకు వేసింది చేవా.

తప్పించుకోవటానికి సరయిన సమయం తెల్లవారుజాము. అప్పుడయితే అందరూ నిద్రావస్థలో ఉంటారు. అందుకే అర్థరాత్రి మూడు గంటల వరకు వేచి ఉంది ఆమె.

ఆవరణ అంతా పూర్తి నిశ్శబ్దంగా ఉంది. కాపలా వాళ్ళు తప్ప అంతా నిద్ర పోయారు.

లేచి నిలబడింది చేవా. చనిపోయిన జవాను దగ్గర నుండి తాళపు చెవులు తీసుకుంది. గది తలుపు నెమ్మదిగా తెరచి నలు వేపులా చూసింది. దగ్గర్లో ఎవరూ కాపలా వాళ్ళు లేరు. ఆవరణ చుట్టూ వలయంలా ఇనుప తీగలతో కంచె వేసి ఉంది. ఆ వలయం చుట్టూ అక్కడక్కడా వాచ్ టవర్లు ఉన్నాయి. వాటి మీద ఉన్నవారు మాత్రం నిలబడి బయట వైపుకు చూస్తున్నారు.

లోపల నుండి ప్రమాదం జరిగే అవకాశం ఏ మాత్రం లేకపోవటంతో వారి చూపు అంతా బయట వేపే ఉంది.

చేవా గది బయటకు నడిచి పక్క గది ఉన్న తాళం తీసింది. చప్పుడు కాకుండా తలుపు తీసింది. లోపల కాంచనమాల కునికిపాట్లు పడుతోంది.

చేవా సైగతో కాంచనమాల కూడా గది బయటకు నడిచింది. చేవాని అభినందిస్తున్నట్లు కాంచనమాల ఆమెను ఆలింగనం చేసుకుంది. ఏమీ మాట్లాడుకోకుండా ఇద్దరూ వెలుతురు పడని ప్రదేశాల్లో నక్కుతూ ముందుకు నడిచారు.

ఇప్పుడు వారికి, బాహ్య ప్రపంచానికి మధ్య ఉన్నది ఇనుప తీగల కంచె మాత్రమే.

ఆ ఇనుప తీగలను దూరం జరిపి బయటకు వెళ్ళిపోదామని సైగ చేసింది చేవా.

కాంచనమాల మరోసారి పరిసరాలన్నీ పరిశీలించింది. ఆమె దృష్టి ఇనుప తీగలకు అటాచ్ చేసిన విద్యుత్ తీగల మీద పడింది. వాటిని చేవాకు చూపించింది. ఇనుప తీగలను పట్టుకుంటే చనిపోతామని సైగ చేసింది.

చేవాకు తాము దాటుకుని వచ్చిన భవనాల్లో ఒకదాని మీద డేంజర్ గుర్తు వేసి ఉండటం గుర్తుకు వచ్చింది. “నువు ఇక్కడే ఉండు. నేను వెళ్లి కరంటు ఆపుతాను. నువు కంచె దాటి వెళ్లిపో…” అంది చేవా.

“వద్దు. నువ్వు కూడా వచ్చాక ఇద్దరం కలిసే వెళ్దాం…” అంది కాంచనమాల.

“ఆలస్యం అయితే ఇద్దరం పట్టుబడే అవకాశం ఉంది. ఇప్పుడు మన ప్రాణాలు కాదు ముఖ్యం. సమాచారం చేరవేయటం ముఖ్యం. నువు తప్పించుకుని పావురాలు దాచిన చెట్టు తొర్ర వద్దకు వెళ్ళు. వాటి ద్వారా సమాచారం కోహిమాకు పంపు…” అని కాంచనమాల రియాక్షన్ కోసం ఎదురు చూడకుండా చీకట్లో కలిసి పోయింది చేవా.

చేవా అనుకున్నట్లే ఎలక్ట్రికల్ పరికరాలు ఉన్న భవనం దగ్గరకు చేరుకుంది. దానికి కాపలాగా ఒక వ్యక్తి ఉన్నాడు. అతని నడుముకు రివాల్వర్ ఉంది. చీకట్లో అతని మీదకు ఎగిరి దూకింది చేవా. మాటు వేసిన చిరుత వేట మీదకు దూకినట్లు దూకి తన పులిగోరుతో అతని ఆట కట్టించింది ఆమె. అతని నడుముకు ఉన్న రివాల్వర్ తీసుకుని ఆ భవనంలోకి ప్రవేశించింది.

అక్కడ అన్నీ ఏవేవో తీగలు, మీటలు ఉన్నాయి. వేటిని అంటుకుంటే ఏమవుతుందో ఆమెకు అర్థం కాలేదు. ఒక చోట అర చేతి సైజులో ఉన్న ఎర్ర మీట ఆమెను ఆకర్షించింది. దాని దగ్గరకు నడిచింది ఆమె. అదే సమయంలో బయట కింద పడిపోయిన వ్యక్తి ఆఖరి శ్వాసను కూడదీసుకుంటూ లేచి నిలబడి దగ్గరలోనే ఉన్న అలారం స్విచ్ నొక్కాడు.

సరిగ్గా చేవా ఆ ఎర్ర మీటను నొక్కటం, బయట ఉన్న వ్యక్తి అలారం నొక్కటం ఒకేసారి జరిగాయి.

ఆవరణ అంతా కరంటు పోయి చీకటి ఆవహించింది. అదే సమయంలో చెవులు చిల్లులు పడేలా అలారం మోగసాగింది.

కాంచనమాల రివ్వున ఇనుప కంచె దగ్గరకు పరుగెత్తి, ఆ తీగల మధ్య నుండి బయటకు పోవటానికి దారి ఏర్పాటు చేసుకుని ఆఖరిసారి వెను తిరిగి చూసింది. చేవా జాడ లేదు. ఇంకా ఆమె కోసం ఎదురు చూడటం అంటే తనను తాను ప్రమాదంలో పడేసుకోవటమే కాబట్టి కాంచనమాల ముందు ఉన్న కంచె దాటి అవతల వైపుకు వెళ్ళి ఎదురుగా ఉన్న అడవి వైపు పరుగెత్తింది.

వాచ్ టవర్‌లో ఉన్న వాళ్ల దృష్టి అలారం మోతకు ఆవరణ వైపు తిరిగింది. మరలా వాళ్ళ చూపు బయట వైపుకు తిరిగే లోపు ఆమె చెట్ల మధ్యకు చేరి పోయింది.

దగ్గరలోనే చెట్టు తొర్రలో దాచిన రివాల్వర్లు, పావురాల కోసం చూసింది ఆమె.

చలికో, తిండి లేకో కానీ రెండు పావురాలూ చనిపోయి ఉన్నాయి. ఇంత ప్రయత్నం చేసి, సమాచారం కోహిమాకు చేరవేసే అవకాశం చెయ్యి జారిపోయిందని ఆమెకు అర్ధం అయింది. ఇక భౌతికంగా కోహిమా వెళ్ళి అచింత్‌ను, డోల్మాను కలుసుకోవలసిందే. తొర్రలో ఉన్న రెండు రివాల్వర్లు తీసి ఒకటి నడుముకు దోపుకుని రెండో దాన్ని చేత్తో పట్టుకుని, చేవాకు సాయం చేయటానికి తిరిగి కంచె వైపు నడిచింది ఆమె.

చెట్ల చాటునే ఉంటూ చేవా ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడసాగింది.

కరంటు పోగానే నలు వైపుల నుండి సైనికులు ఎలక్ట్రికల్ భవనం వైపు రాసాగారు. వారికి కనపడకుండా కాసేపు చీకట్లో దాక్కుంది చేవా. ఇంతలో వారిలో కొందరికి ఎలక్ట్రికల్ భవనం ముందు చచ్చి పడి ఉన్న తమ సహచరుడు కనిపించాడు. వారంతా వెంటనే స్పందించారు. మరి కొందరు భవనంలోకి వెళ్ళి కరంటు వచ్చేలా చేశారు.

ఇక తప్పించుకోవటం కష్టమని చేవాకు అర్ధమయింది. చేతిలోని రివాల్వర్‌తో దగ్గరలోని సైనికుల మీద కాల్పులు జరిపింది. ఇద్దరు సైనికులు హాహాకారాలు చేస్తూ కింద పడిపోయారు.

ఇప్పుడు ఫ్లడ్‌లైట్లు కూడా వెలిగాయి. చేవా అందరికీ కనిపిస్తోంది. అందరు ఆమె మీద కాల్పులు జరుపుతున్నారు. తన రివాల్వర్‌లో గుళ్ళు అయిపోయే వరకు వారి మీద కాల్పులు జరిపి, తరువాత ఇనుప కంచె వైపు పరుగు తీసింది ఆమె.

అయితే పదుల కొద్దీ సైనికులు ఏక కాలంలో జరుపుతున్న కాల్పుల్లో చేవా శరీరం ఛిద్రమయింది. అర క్షణంలో ఆమె ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

ఇదంతా స్పష్టంగా కనిపించక పోయినా, ఆగిపోయిన కాల్పులు ఏమి జరిగి ఉంటుందో కాంచనమాలకు తేటతెల్లం చేశాయి. రెండు కన్నీటి చుక్కలు ఆమె బుగ్గల మీద జారి కింద పడ్డాయి.

అంత బాధలోనూ ఆమెకు జరగాల్సింది గుర్తుకు వచ్చింది. ఆలస్యం చేసేకొద్దీ సైనికులు వెతుకులాట మొదలుపెడతారని ఆమెకు తెలుసు. అందుకే అడవిలోకి పరుగెత్తింది.

ఆ తరువాత సైనికులు పారిపోయిన కాంచనమాల కోసం అడవినంతా గాలించారు.

కానీ ఆమె ఆచూకీ వారికి లభించలేదు.

వార్నర్ కారులో ఎక్కిన ఫ్లోరెన్స్, మధుబాల అరగంటలో ఫోర్ట్ విలియమ్‌లో ఉన్న అతని ఇంటికి చేరుకున్నారు.

ఫోర్ట్ విలియమ్ మెయిన్ గేటు నుండి లోపలకు వెళ్తుంటే కనిపిస్తున్న ప్రతి బిల్డింగును, ప్రతి వివరాన్ని మనసులో ముద్రించుకుంటున్నారు వారు.

మధ్యలో వార్నర్ ఏదో మాట్లాడబోతే, "ష్ష్ష్..." అంటూ పక్క వారు వింటారన్నట్లు సైగ చేసింది ఫ్లోరెన్స్.

కారు అతని ఇంటిని సమీపిస్తుండగా, అతని ఇంటి ఆవరణ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నిలిపి ఉంచిన రెండు టైగర్‌మోత్ విమానాలు కనిపించాయి.

"ఓ... ఇక్కడ విమానాలు కూడా ఉన్నాయే? వీటిని ఎవరు వాడతారు?" అని అడిగింది ఫ్లోరెన్స్.

"కమాండర్ గారి కోసం వాడతారు..." చెప్పాడు వార్నర్.

ఇంతలో కారు అతని నివాసానికి సమీపించటం, వాళ్లని అతను స్వయంగా లోపలకు తీసుకు వెళ్లటం జరిగింది. వాళ్లకు కాస్త సమయం ఇచ్చిన వార్నర్ ఆ తరువాత తన ప్రశ్నలు అడగటం మొదలు పెట్టాడు.

అతను అడుగుతున్న ప్రశ్నలకు అన్నీ తప్పు సమాధానాలు ఇస్తూ పోతోంది ఫ్లోరెన్స్.

ఒక గంట గడిచాక, "మా కడుపు నింపే పని ఏమీ లేదా? ఎంతసేపూ ప్రశ్న మీద ప్రశ్న వేయటమేనా?" అంది ఫ్లోరెన్స్.

"అయామ్ సారీ!" అంటూ డిన్నర్ ఏర్పాట్లు చేయించటానికి బయటకు వెళ్లాడు వార్నర్.

అతను బయటకు వెళ్లాక మధుబాల మొదటిసారి మాట్లాడింది. "ఫ్లోరెన్స్! ఇతనెవరో పెద్ద అధికారి అనిపిస్తున్నాడు. మనకు ఈ ఇంటిలో ముఖ్యమయిన సమాచారం లభించవచ్చు..." అంది.

"లభించవచ్చు కాదు, లభిస్తుంది. ఎందుకంటే... ఇతనే కౌంటర్ ఇంటెలిజెన్స్ చీఫ్." చెప్పింది ఫ్లోరెన్స్.

"నీకు ఎలా తెలుసు?"

"అతని ఐడీ కార్డు చూశాను."

"ఆ పని ఎప్పుడు చేశావ్?"

"నువు బాత్‌రూంలో ఉన్నపుడు."

“అయితే మనం వచ్చిన పని ఇక్కడే సులువుగా పూర్తికావొచ్చు అన్నమాట. కాకపోతే మన మూలంగా సంతోష్ పట్టుబడిపోతున్నాడు…”

“మన మూలంగా కాదు. వీళ్లకు అతని గురించి ఎప్పటి నుండో తెలిసి ఉండాలి. లేకపోతే మనం వచ్చే సమయానికి ఎలా మాటు వేసి ఉంటారు?”

“అదీ నిజమే…” అంది మధుబాల.

ఇంతలో వార్నర్ తిరిగి వచ్చి వీరిని డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకు వెళ్లాడు. డిన్నర్ పూర్తయ్యేటప్పటికి రాత్రి పది అయ్యింది. “ఇప్పుడు చెప్తారా?” అన్నాడు వార్నర్. అతను ఈ అమ్మాయి ఇచ్చే సమాచారాన్ని తెలుసుకోవటానికి అస్సలు ఆగలేకపోతున్నాడు.

“ష్యూర్, ష్యూర్… ఇంకొక చిన్న రిక్వెస్ట్. మీ దగ్గర గట్టిగా ఉండే మెటల్ పరికరం… అంటే సుత్తి లాంటిది ఏదన్నా ఉందా?” అని అడిగింది.

“సుత్తి లాంటిది ఎందుకు? సుత్తే ఉంది…” అంటూ ఒక సుత్తి తెచ్చి ఇచ్చాడు.

కాంచనమాల చున్నీ తీసుకుని ఆ సుత్తి చుట్టూ చుట్టసాగింది ఫ్లోరెన్స్.

“వాటార్యూ డూయింగ్?”

“జస్ట్ ఒన్ మినిట్…” అంటూ పని పూర్తి చేసిన ఫ్లోరెన్స్ ఆ సుత్తి పెట్టి అతని నెత్తి మీద ఠపీ మని కొట్టింది.

అంతే! కనుగుడ్లు తేలేసిన వార్నర్ స్పృహ తప్పి కింద పడిపోయాడు.

కర్టెన్లు చించి వాటిని తాడులాగా పేని అతని కాళ్లూ, చేతులూ గట్టిగా బంధించింది కాంచనమాల. శబ్దాలు చేయకుండా అతని నోట్లో కర్చీఫ్ కుక్కి దాని మీద నోటికి అడ్డుగా మరో గుడ్డ కట్టారు.

అతన్ని లాక్కుంటూ వెళ్ళి ఒక బెడ్‌రూంలో పడేసి, దాని తలుపులు వేసేశారు.

ఆ తరువాత ఇంట్లో కనిపించిన ప్రతి కాయితం వెతకటం మొదలు పెట్టారు.

అతని ఆఫీసు గదిలో కొత్త విషయాలు ఏమీ తెలియలేదు కానీ, బెడ్‌రూంలోని ఒక బీరువాలో జాగ్రత్తగా దాచిన ఒక ఫైలు కనిపించింది.

దానిలో ఒక్కొక్క పేజీ చదివేకొద్దీ వారికి భయం కలగసాగింది.

“మైగాడ్!...” అంది మధుబాల. “ఇదొక పెద్ద కుట్ర. వాళ్ల సైన్యాన్ని తరలించటం అన్నది ఉట్టిమాట. దానినంతా కోహిమా దగ్గరలోని రహస్య ప్రదేశంలో దాచి ఉంచారు. అది కాక ఇరవై వేల సైన్యం కలకత్తాలో సిద్ధంగా ఉంది. మన సైన్యం బర్మా సరిహద్దులు దాటి రాగానే, కోహిమా దగ్గర దాక్కుని ఉన్న బ్రిటిషు సైన్యం కోహిమాకు వచ్చేస్తుంది. మన వారిని నిలువరిస్తుంది. మరో పక్క వానాకాలం వచ్చేసింది. ఏ నిమిషమయినా వానలు పడటం మొదలవుతాయి. వానలు పడ్డాయంటే అడవి దారులన్నీ మూసుకు పోతాయి. మన వాళ్లు వెనక్కి వెళ్లాలన్నా వెళ్లలేరు. అప్పుడు కలకత్తాలో భారీ

సంఖ్యలో ఉన్న సైన్యాన్ని విమానాలలో తరలించి పారాచూట్ల ద్వారా యుద్ధ రంగానికి తరలిస్తారు. పద్మవ్యూహంలో చిక్కుకు పోయిన అభిమన్యుడిలా అవుతుంది మన సైన్యం పరిస్థితి.”

“అయితే సుభాస్ చంద్ర బోస్ గారు ఊహించింది నిజమే. వెంటనే మన సైన్యాన్ని ముందుకు రావొద్దని సందేశం పంపించాలి. ఇంకొక నాలుగు నెలలు ఆగి వానలు తగ్గాక దాడి చేస్తే ఆజాద్ హింద్ ఫౌజుకు ఎదురు ఉండదు. ఇప్పుడే దాడి చేస్తే మాత్రం తీవ్ర నష్టం తప్పదు...”

“కానీ మనం సందేశం పంపేది ఎలా?” ఆందోళనగా అంది మధుబాల.

“ఇక్కడ సంతోష్ ఆచూకీ వీళ్లకు ఎప్పటి నుండో తెలుసు. నిన్నటి చర్చ్ సంఘటన తరువాత అతన్ని అరెస్ట్ చేసి ఉన్నా ఆశ్చర్యం లేదు. కాబట్టి ఇక మనకు సంతోష్ వలన ఉపయోగం లేదు. కోహిమా వెళ్దాం. అచింత్ దగ్గర ఉన్న రేడియో ద్వారా ఈ సందేశాన్ని చేరుద్దాం...” చెప్పింది ఫ్లోరెన్స్.

“కానీ కోహిమా వెళ్లటం అంటే మాటలా? ఎలా వెళ్తాం?”

“వచ్చేటపుడు చూడలా... బయట రెండు విమానాలు నిలిపి ఉన్నాయి. అందులో మనకు ఒకటి చాలు, మనం కొన్ని గంటల్లో కోహిమా వెళ్లిపోతాం.” ఉత్సాహంగా చెప్పింది ఫ్లోరెన్స్. విమానాన్ని మళ్లీ ఎగిరించటం గురించి తలచుకోగానే ఆమెలో ఎక్కడలేని ఉత్సాహం పెల్లుబికింది.

ఒక టేబుల్ డ్రాయర్‌లో రివాల్వర్లు, అదనపు బుల్లెట్లు కనిపించాయి. చెరొక రివాల్వర్ తీసుకుని గుప్పిళ్లతో బుల్లెట్లు జేబుల్లో నింపుకున్నారు.

“ఒకసారి అదృష్టం కలిసి వచ్చింది కదా అని ప్రతిసారీ వస్తుందా?” అనుమానంగా అనుకుంది మధుబాల.

“డోంట్ వర్రీ! పద వెళ్దాం...” అంటూ బయటకు నడిచింది ఫ్లోరెన్స్.

అప్పుడు సమయం తెల్లవారుజాము నాలుగు గంటలవుతోంది. ఫోర్ట్ విలియమ్‌తో సహా కలకత్తా నగరం ఇంకా నిద్ర మత్తులో ఉంది.

వార్నర్ ఇంటి నుండి బయటకు వచ్చిన ఆ ఇద్దరు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ విమానాలు ఉన్న మైదానం వైపు నడిచారు.

రెండు విమానాలు పక్కపక్కన నిలిపి ఉన్నాయి. దానికి కాపలా కోసం ఉంచిన ఒక వ్యక్తి కొద్దిగా దూరంగా ఉన్న షెడ్డు కింద నిద్ర పోతున్నాడు.

చిరకాలపు మిత్రుడిని చూసినట్లు దానిని చూసింది ఫ్లోరెన్స్. తరువాత విమానంలో ఉన్న పార్టులను, వాటి ఉపయోగాలను మధుబాలకు వివరించింది ఆమె.

“ఇప్పుడదంతా ఎందుకు? నువ్వు ఉన్నావుగా?” అంది మధుబాల.

విమానంలో పెట్రోల్ ఎంత ఉందో చూసింది ఫ్లోరెన్స్. దాని ట్యాంకులో పెద్దగా పెట్రోల్ లేదు. కాకపోతే పక్కనే నిలిపి ఉంది పెట్రోల్ ట్యాంకర్. "పోయినసారి పెట్రోల్ ట్యాంకులో పెట్రోల్ ఉందో, లేదో చూసుకోక పోవటం వలన ప్రమాదం జరిగింది. ఈసారి అది జరగదు..." అంది మధుబాలతో.

"పెట్రోల్ నింపటానికి ఆ ట్యాంకరును తీసుకు వద్దామా?" అడిగింది మధుబాల.

"దాని ఇంజిన్ శబ్దానికి ఆ కాపలావాడు లేచాడంటే మన ప్రయాణం ఇక్కడే ముగిసి పోతుంది. ఈ విమానాన్నే ఆ ట్యాంకర్ దగ్గరకు తోసుకు పోదాం..." అంది ఫ్లోరెన్స్.

ఇద్దరూ కలిసి ట్యాంకర్ వరకు విమానాన్ని తోసుకుంటూ వెళ్లారు. ట్యాంకరుకు ఉన్న హోస్ విమానం ట్యాంకుకు బిగించి, "పోయినసారి నువు చేసిన క్రాష్ ఈసారి చేయకూడదని కోరుకుందాం..." అంది మధుబాల.

"డోంట్ వర్రీ! నేను క్రాష్ కోర్స్ చేశాను." అంది ఫ్లోరెన్స్.

అర్థం కానట్లు మొహం పెట్టింది మధుబాల.

"క్రాష్ కోర్స్ అంటే ఏంటో తెలుసా... క్రాష్ చేయటానికి నేర్చుకునే కోర్సు..." నవ్వుతూ చెప్పింది ఫ్లోరెన్స్. "అందుకేగా నీకు అన్నీ నేర్పించింది. నువు కూడా ఇక సమాన భాగస్వామివి..." అంది.

మరలా విమానాన్ని తోసుకుంటూ తిన్నగా ఏ అడ్డంకులూ లేని ప్రదేశానికి తీసుకు వెళ్లారు. ముందుగా మధుబాలను వెనుక సీట్లో కూర్చో పెట్టి, తను వెళ్ళి ప్రొపెల్లర్ తిప్పి ఇంజిన్ స్టార్ట్ చేసింది ఫ్లోరెన్స్.

బర్రుమని శబ్దం చేస్తూ విమానం ఇంజిన్ స్టార్ట్ అయింది.

ఆ శబ్దానికి కాపలా ఉండాల్సిన వ్యక్తి నిద్ర లేచాడు. అతనికి ఏం జరుగుతుందో అర్థమయ్యే లోపు ఫ్లోరెన్స్ పరుగెత్తుకుంటూ వచ్చి విమానం ముందు సీట్లో కూర్చుని దానిని ముందుకు నడిపింది.

"ఏయ్, ఏయ్..." అంటూ విమానం వైపు పరుగెత్తాడు అతను.

అప్పటికే అది వేగం అందుకుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS